క్లుప్తంగా

వినియోగించుకోండి

ఖమ్మంవ్యవసాయం: మెరుగైన, వేగవంతమైన సేవలు అందించడం కోసం రూపొందించిన టీజీఎస్పీడీసీఎల్ యాప్‌ను వినియోగించుకోవాలని ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 ఫీచర్లతో యాప్‌ను రూపొందించిందని, ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వండి


విఘ్నేష్

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లికి చెందిన పద్నాగేళ్ల బాలుడు శిఖ విఘ్నేష్ బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తండ్రి దయాకర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. సమాచారం తెలిసిన వారు 87126 59217, 87126 59218 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

ఇంటి పత్రాలు అందించాలి

కామేపల్లి: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా తమకు మంజూరు పత్రాలు ఎంపీడీఓ రవీందర్ ఇవ్వడంలేదని రేపల్లెవాడ గ్రామానికి చెందిన తేజావత్ రవి, గుగులోత్ రాజు ఆరోపించారు. బుధవారం కామేపల్లిలో వారు మాట్లాడుతూ.. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలపగా.. పత్రాలు ఇవ్వాలని ఎంపీడీఓకు సూచించారని, అయినా ఇవ్వడం లేదని, మంజూరు పత్రాలు అందించి ఆదుకోవాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రమేష్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా దొడ్డా ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్.కరామత్ అలీ, ఆర్థిక కార్యదర్శిగా కాట్రగడ్డ శ్రీధర్‌బాబు, అసోసియేట్ అధ్యక్షులుగా డి.వెంకటేశ్వరరావు, మాలిని, రాము, మహిళా కార్యదర్శులు జానకి రాణి, వనజ, ఉషశ్రీ, ప్రచార కార్యదర్శిగా ఎస్‌కె.సైదా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్.కరుణాకర్, గౌరవ సలహాదారులుగా ఆర్.చలపతిరావు, కరుణకుమారి, గోపాలరావు, బోణాల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

నవోదయ దరఖాస్తుల గడువు పొడిగింపు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అక్టోబర్ 7 వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమ్మెకాలపు వేతనం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంజాన్

ఖమ్మం సహకారనగర్: కేజీబీవీ(కస్తూర్బా గాంధీ), యూఆర్ఎస్ (అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్), సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మినిమం టైం స్కేల్‌తో పాటు ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసి రెగ్యులర్ ఉద్యోగులకు కల్పించిన అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకన్న, షమి, రాంబాబు, రాందాస్, నర్సయ్య, నాగేశ్వరరావు, సురేష్, పద్మ, ప్రశాంతి, ఉద్దండ్, సుధాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	32	బచ్చలికూర	4
వంకాయ	30		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	50	తోటకూర	4
దొండ	48		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	56		20
గోరుచిక్కుడు	50	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		40
చామగడ్డ	28	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

యూపీహెచ్‌సీకి విడుదల..


ట్రంక్‌రోడ్‌లో నిర్మిస్తున్న వెంకటేశ్వర్‌నగర్ యూపీహెచ్‌సీ నూతన భవనం

- పూర్తి కావొచ్చిన యూపీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు
- రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మాణం
- వచ్చే నెల ప్రారంభించేందుకు ఏర్పాట్లు

తీరనున్న అద్దె, మున్నేరు వరద బెంగ

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని వెంకటేశ్వర్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కోసం నూతనంగా నిర్మిస్తున్న భవనం పూర్తి కావొచ్చింది. భవనాన్ని త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తున్నారు. గతేడాది మార్చిలో వెంకటేశ్వర్‌నగర్ యూపీహెచ్‌సీ నూతన భవనం కోసం నగరంలోని ట్రంక్‌రోడ్‌లోని పాత డీఈఓ కార్యాలయ స్థలాన్ని అధికారులు కేటాయించి శంకుస్థాపన చేశారు. అయితే పనులు మాత్రం ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది నుంచి పనులు జోరందుకోవడంతో ప్రస్తుతం ముగింపుదశకు చేరుకుంది.

చాలా ఏళ్లుగా అద్దెభవనంలోనే..

నగరంలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండగా ముస్తఫానగర్, మామిళ్లగూడెం, శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. వెంకటేశ్వర్‌నగర్ యూపీహెచ్‌సీకి సొంత భవనం లేక చాలా ఏళ్లుగా అద్దె భవనంలోనే నెట్టుకొస్తున్నారు. సొంత భవనం కోసం జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం లేకుండాపోయింది. ఈ నేపథ్యాన గతేడాది యూపీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టారు. చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలి ఉండగా.. వాటిని పూర్తి చేసేందుకు ఆయా పనులు జరిపిస్తున్నారు.

పరిధి ఎక్కువ..

వెంకటేశ్వర్‌నగర్ యూపీహెచ్‌సీ సెంటర్ పరిధి ఎక్కువగా ఉంటుంది. జూబ్లీపుర, బొక్కలగడ్డ, మంచికంటినగర్, వెంకటేశ్వర్‌నగర్‌తో పాటు శుక్రవారిపేట, బ్యాంక్‌కాలనీ, నిజాంపేట కొంత ప్రాంతం ఈ సెంటర్ పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం సారథినగర్‌లో అద్దెభవనంలో నిర్వహిస్తున్న సెంటర్‌కు నిత్యం 100 మందికి పైగా పేషంట్లు వైద్య సేవలకు వస్తుంటారు. ఈ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌తో పాటు 18 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గతంలో రెండు సార్లు వచ్చిన వరదలకు సెంటర్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. దీంతో మందులు, సామగ్రి పూర్తిగా తడిసిపోయి రూ. లక్షల్లో నష్టం వాటిల్లింది. దీనికి తోడు అద్దె భవనం కావడంతో అద్దె చెల్లింపుల విషయంలోనూ ఇబ్బందులు తలెత్తేవి. ప్రభుత్వం నుంచి నిధులు ఆలస్యంగా విడుదల కావడం వంటి సమస్యలతో యజమానితో తరచూ సమస్యలు వచ్చేవి. వీటన్నింటికి స్వస్తి పలికేలా వచ్చే నెలలో యూపీహెచ్‌సీకి నూతన భవనం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండడంతో అద్దె కష్టాలు తీరనున్నాయి. ఇక నుంచి మున్నేరు వరద తాకిడి కూడా ఉండే ఆస్కారం లేదు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

– సాక్షినెట్‌వర్క్


తిరుమలాయపాలెం: ఎర్రగడ్డలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు


కూసుమంచి: నర్సింహులగూడెంలో అన్నదానం


ఖమ్మంగాంధీచౌక్: జమ్మిబండపై చిన్నారుల ప్రదర్శన

కార్మికులను ఆదుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రంలో ఆటో మోటార్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ అనుబంధం) జిల్లా కార్యదర్శి షేక్.లాల్మియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరిగే రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లే కారణమని ప్రభుత్వం జరిమానాల రూపంలో రూ.వందల కోట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆటోస్టాండ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీనివాస్, నాయకులు ఎడ్లపల్లి ఉపేందర్, ములకలపల్లి లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, నాగరాజు, కుమార్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర


సభలో మాట్లాడుతున్న సాయిబాబు

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడం కోసమే నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తీసుకొచ్చిందని, అంగన్‌వాడీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని మహాసభల కోశాధికారి ఎం.సాయిబాబు ఆరోపించారు. బుధవారం ఖమ్మం మంచికంటి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైమరీ పీఎం శ్రీవిద్య పేరుతో ఐదేళ్లలోపు పిల్లలను అన్నిచోట్ల ఐసీడీఎస్‌కే అప్పగించారని, తెలంగాణ ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎఫ్ఐఎస్ యాప్‌ను రద్దుచేసి ఒకే యాప్‌ను కొనసాగించి 5జీ నెట్ వర్క్ మొబైల్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కందునూరి సుధారాధ, పిన్నింటి రమ్యతో పాటు 43 మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణు, కళ్యాణం వెంకటేశ్వరరావు, అంగన్వాడీ రాష్ట్ర నాయకులు బి.కోటేశ్వరి, పాపారాణి, ఎస్.నాగమణి, పద్మ, ఉమా, ప్రమీల, కళ్యాణి, విజయలక్ష్మి, స్వరూప, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

కులనిర్మూలన వ్యవస్థ చైతన్యం రావాలి


మాట్లాడుతున్న హనుమంతరావు

కూసుమంచి: కుల నిర్మూలన, అంటరానితనాన్ని పారదోలేందుకు సమాజంలో చైతన్యం రావాలని మాస్‌లైన్ జిల్లా నాయకుడు తిమ్మిడి హనుమంతరావు అన్నారు. బుధవారం పాలేరులో సత్యశోధన సమాజ్ 153వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పాలకవర్గాల తీరుతో నేటికి అణగారిన వర్గాలకు అన్యాయమే జరుగుతుందన్నారు. ఈ అసమానతలు పారదోలేందుకు సమష్టిగా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శివలింగం, నాయకులు ఆజాద్, మండల కార్యదర్శి పోటు నాగేశ్వరరావు, చాపల సత్యనారాయణ, రోషయ్య, గురువారెడ్డి, రమాదేవి, రోజా తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి బుధవారం పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న, ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, నాయకులు వరప్రసాద్, వెంకన్న, కృష్ణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ద్వారా కలిగే ప్రయోజనాలను ఆయా యాజమాన్యాలు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మం రాపర్తినగర్: మాట్లాడుతున్న కవిత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణరావు

రూ.23 వేల జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కర్రీ పాయింట్లు, కేటరింగ్స్ కిచెన్లలో కేఎంసీ శానిటేషన్ అధికారులు తనిఖీలు నిర్వహించి పలువురికి జరిమానా విధించారు. ఓ కేటరింగ్ కిచెన్‌లో 5 కిలోల ప్లాస్టిక్ సంచులను సీజ్ చేసి రూ.10 వేల జరిమానా విధించగా, ఓ హోటల్‌లో రెండు కేజీల కవర్లను సీజ్ చేసి రూ.2 వేలు, ఓ కేటరింగ్ నిర్వాహకులకు రూ.4 వేలు, ఓ కర్రీ పాయింట్‌లో అపరిశుభ్రత ఆహారం గుర్తించి రూ.7 వేలు మొత్తంగా రూ.23 వేల జరిమానా విధించారు. నిషేధిత కవర్లు వినియోగించినా, అపరిశుభ్ర వాతావరణం కనిపించినా కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువులో పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ శీతాకాలం శిబిరంలో భాగంగా బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సహకారంతో డాక్టర్లు రాంబాబు, పాల్వాయి నిరీష గ్రామస్తులకు కంటి పరీక్ష, ఆరోగ్య, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సమావేశంలో సామాజిక స్పృహపై వ్యక్తిత్వ వికాస నిపుణుడు కార్తికేయ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణరావు, అధ్యాపకులు విశ్వేశ్వరరావు, చంద్రమౌళి, పరుశురాం, సిబ్బంది ఉపేందర్, చిలకమ్మ పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న లాలుప్రసాద్

కూసుమంచి: మండలంలోని ధర్మాతండాకు చెందిన జర్పుల సింధు రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతన స్థితిలో ఉండగా.. ఆమె వైద్య ఖర్చులకు ఎన్ఆర్ఐ అభిషేక్ రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందించారు. బుధవారం ఇట్టి సాయాన్ని అభిషేక్ స్నేహితుడైన సేవాలాల్ సేనా రాష్ట్ర కార్యదర్శి జర్పుల లాలుప్రసాద్ సింధుకు అందించి ఆరోగ్యం కుదుటపడేందుకు మరింత సాయం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకట్, నారాయణ, భద్రు, తారాచంద్, సునీల్, పూల్‌సింగ్, నాగరాజు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

కూసుమంచి: వచ్చే నెల 6న కూసుమంచిలో నిర్వహించే తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలపై సంఘం ఆధ్వర్యాన అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. పాలేరు డివిజన్ మహాసభలో రైతులు పార్టీలకతీతంగా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గంగాధర్, రమణారెడ్డి, నరసింహారావు, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సన్మంతరావు, సుదర్శన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఆరెంపులలో సందడే సందడి..


మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన మండలంలోని ఆరెంపుల గ్రామంలో గృహ ప్రవేశాలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై కొత్తగా గృహ ప్రవేశాలు చేసుకున్న వారికి నూతన పట్టువస్త్రాలు కానుకగా సమర్పించారు. అనంతరం చిర్రా రాజ్యం, రాము దంపతుల ఇంట్లో మంత్రితో పాటు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, ఆర్డీఓ నర్సింహారావులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. తొలుత మహిళలు బతుకమ్మలతో మంత్రికి స్వాగతం పలికారు. టపాసులు కాల్చుతుండగా.. ఓ ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ కాలిపై పడి గాయమైంది. ఓ బాలిక స్పృహ తప్పి పడిపోయింది. కానిస్టేబుల్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, గ్రామ కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్ దసరా పండగ సందర్భంగా తన సొత ఖర్చులతో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పనిచేస్తాం..


ఓపెన్ జిమ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నగర పాలక సంస్థ కట్టుబడి పని చేస్తుందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బుధవారం నగరంలోని 53వ డివిజన్ పరిధిలో ఓపెన్ జిమ్, వాకర్స్ ట్రాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వీటి ఏర్పాటుతో స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన విధానం మరింత చేరువ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, పగడాల శ్రీవిద్య, 52వ డివిజన్ కార్పొరేటర్ బుర్రి వెంకట్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ పునుకొల్లు రామబ్రహ్మం, స్ఫూర్తి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, కార్యదర్శి జి.చలపతిరావు, వైస్ ప్రెసిడెంట్ ఇందిర, సహాయ కార్యదర్శి తాళ్లూరి శశికుమార్, గౌరవాధ్యక్షుడు ముత్తయ్య, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు


అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ ఈనెల 26న ఖమ్మం కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ చేపట్టే ఆమరణ నిరాహార దీక్షకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదేపల్లి కృష్ణమాచారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లారావుతో పాటు శివరామకృష్ణ, మల్లికార్జున్, పసుపులేటి నాసరయ్య, పెళ్ళూరి విజయకుమార్, రెడ్డబోయిన వరలక్ష్మి, కామని అనంత లక్ష్మి, కూరపాటి సతీష్, గాజుల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నానబియ్యం బతుకమ్మకు పూజలు

బతుకమ్మ వేడుకల్లో భాగంగా నాల్గవ రోజు నానబియ్య బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ వద్ద పూజలు చేసి ఆడిపాడారు. అనంతరం చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


కేఎంసీలో బతుకమ్మకు పూజలు చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు


ఖమ్మంవైరారోడ్: బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో బతుకమ్మ ఆడుతున్న సిబ్బంది


ఖమ్మం సహకారనగర్: వివిధ వేషధారణలో న్యూవిజన్ విద్యార్థులు


ఖమ్మంఅర్బన్: 12వ డివిజన్‌లో..


ఖమ్మంగాంధీచౌక్: విజయ్‌నగర్ కాలనీలో కోలాటమాడుతూ నృత్యాలు చేస్తున్న మహిళలు

విస్తరిస్తున్న సహకారం..?

- మూడు నుంచి ఏడు సంఘాలుగా పెంపు
- ఎన్నికలు పూర్తయ్యాక అమల్లోకి..


మంచుకొండ సహకార సంఘం కార్యాలయం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నియోజకవర్గ పరిధిలో సహకార సంఘాల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు రఘునాథపాలెం మండలంలోని వీవీపాలెం, రఘునాథపాలెం, మంచుకొండ సహకార సంఘాలు రైతులకు సేవలందిస్తుండగా.. తాజాగా మరో నాలుగు సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మొత్తం సంఘాల సంఖ్య ఏడుకు చేరనుంది. రైతులకు ఉపయోగపడేలా సంఘాల బలోపేతంతో పాటు ఎరువులు, విత్తనాల పంపిణీ, రుణాల మంజూరు వంటి సౌకర్యాలు సులభంగా అందేలా సంఘాల విస్తరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రణాళిక..

జిల్లావ్యాప్తంగా సుమారు 35 నుంచి 40 కొత్త సంఘాలను ఏర్పాటు చేసే ప్రణాళిక ఉన్నట్లు సమాచారం. మండలాల వారీగా గతంలో ఉన్న సంఘాల పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసే సంఘాల జాబితాలను తయారు చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపినట్లు తెలిసింది. దానిలో భాగంగా వీ.వీ.పాలెం సహకార సంఘం పరిధిలో అల్లిపురం, వేపకుంట్లలో కొత్త సంఘాలు ప్రారంభించనున్నారు. మంచుకొండ సహకార సంఘం పరిధిలో ఈర్లపుడి, చిమ్మపూడి గ్రామాల్లో సహకార సంఘాలను ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కొత్త సంఘాలు కలిపి..

ఇప్పటికే రైతులకు యూరియా పంపిణీ భాగంగా ప్రతిపాదిత ప్రాంతాల్లోనే యూరియా కేంద్రాలను ఏర్పాటు చేసి, వ్యవసాయ శాఖ లైసెన్సులు జారీ చేసినట్లు తెలిసింది. రానున్న రోజుల్లో ఎన్నికలు పూర్తయ్యాక కొత్త సంఘాలు కూడా కలిపి ఖమ్మం నియోజకవర్గంలో ఏడు సహకార సంఘాలకు కేంద్ర సహకార బ్యాంకు అనుబంధంగా సహకార సంఘాలు కొనసాగనున్నాయి. దీంతో రైతులకు సేవలతో పాటు ఆయా ప్రాంతాల్లో రాజకీయ పదవులు సైతం పెరగనున్నాయి.